# విశాల భారతి

తెలుగు దినపత్రిక

5-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్

సంపుటి:4 సంచిక: 60


## మావోయిస్టు అగ్రనేత గణపతి సరెండర్?

- ఢిల్లీలో అమిత్ షా సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టు మాజీ చీఫ్ గణపతి
- ఆపరేషన్ కగార్ డెడ్ లైన్‌కు ముందే వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకున్న బలగాలు
- కేంద్రం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలంగాణ, కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగాల సమష్టి ఆపరేషన్ సక్సెస్
- నాలుగున్నర దశాబ్దాల అజ్ఞాతానికి తెర.. అనారోగ్య కారణాలతో నిర్ణయం
- త్వరలోనే అధికారిక ప్రకటన చేయనున్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దశాబ్దాల పాటు భారత అంతర్గత భద్రతకు సవాలుగా నిలిచిన మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక భారీ అంకానికి తెరపడింది. నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు ఎట్టకేలకు ప్రభుత్వానికి లొంగిపోయారు. దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమక్షంలో ఆయన సరెండర్ అయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ కీలక పరిణామం నేపథ్యంలో కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 4లో..

# చమురు యుద్ధం..!

## 75 ఏళ్ల నాటి మొసాదేగ్ ఉదంతం నుంచి మొదలైన అమెరికా-ఇరాన్ వైరం

- 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత బద్ధశత్రువులుగా మారిన ఇరు దేశాలు
- అణు ఒప్పందం నుంచి ట్రంప్ వైదొలగడం, అణ్వాయుధ తయారీపై ఇజ్రాయెల్ ఆందోళన
- 2025 జూన్‌లో ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా, ఇజ్రాయెల్ మెరుపు దాడులు
- పెట్రో డాలర్ ఉనికిని కాపాడుకునేందుకు అమెరికా వేస్తున్న వ్యూహాత్మక అడుగులు
- చైనా, రష్యాలకు ఇరాన్ ఇస్తున్న సహకారాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా దాడులు



**అంతర్జాతీయం, విశాలభారతి:**

అమెరికా, ఇరాన్ మధ్య నేడు కనిపిస్తున్న ఉద్రిక్తతలకు బీజాలు ఈనాటివి కావు. సరిగ్గా 75 ఏళ్ల క్రితం ఇరాన్ ప్రధానిగా ఉన్న మహ్మద్ మొసాదేగ్, తమ దేశ చమురు సంపదను జాతీయం చేయాలని నిర్ణయించుకోవడంతో ఈ కథ మొదలైంది. అప్పటి వరకు ఇరాన్ చమురుపై ఆధిపత్యం చెలాయించిన బ్రిటన్, అమెరికాలు మొసాదేగ్ నిర్ణయంతో తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని భావించాయి. దీంతో కుట్ర పన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మొసాదేగ్ ప్రభుత్వం కూలిపోయేలా చేసి, తమకు అనుకూలుడైన మొహ్మద్ రెజా షా పహ్లావీకి పగ్గాలు అప్పగించాయి. ఈ పరిణామం ఇరాన్ ప్రజల్లో అమెరికాపై తీవ్ర వ్యతిరేకతను పెంచింది, తమ అంతర్గత విషయాల్లో విదేశీ జోక్యం అన్యాయమని వారు భావించారు. అమెరికా అండతో పాలన సాగించిన షా హయాంలో సంపద కొందరికే పరిమితం కావడం, ఇస్లామిక్ సంప్రదాయాలను విస్మరించడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిల్చాయి. ఫలితంగా 1979లో అయతుల్లా ఖొమేనీ నేతృత్వంలో వచ్చిన ఇస్లామిక్ విప్లవం ఇరాన్ ముఖచిత్రాన్ని మార్చేసింది. ఆ సమయంలో టెహ్రాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై దాడి చేసి 52 మంది అమెరికన్లను 444 రోజుల పాటు బందీలుగా ఉంచడం ప్రపంచాన్ని కుదిపేసింది. అప్పటి నుండి అమెరికాను 'పెద్ద సైతాన్'గా, ఇజ్రాయెల్‌ను 'చిన్న సైతాన్'గా ఇరాన్ వర్ణించడం మొదలుపెట్టింది.

మిగతా 2లో..





## రాజ్యసభకు రేవంత్ మార్క్

- తెలంగాణ రాజ్యసభ రేసులో వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వి పేర్లు ఖరారు
- సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు నరేందర్‌రెడ్డికి దక్కిన సముచిత స్థానం
- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వికి తెలంగాణ కోటా నుంచి అవకాశం
- ఢిల్లీ వేదికగా ఏఐసీసీ పెద్దలతో జూమ్ మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకున్న అధిష్టానం
- అసెంబ్లీలో కాంగ్రెస్‌కున్న స్పష్టమైన మెజారిటీతో ఏకగ్రీవమయ్యే అవకాశాలు మెండు
- నేడు ఉదయం అసెంబ్లీలో నామినేషన్లు దాఖలు చేయనున్న అభ్యర్థులు

02



02

## ఇరాన్ నౌకను ముంచేసిన అగ్రరాజ్యం

- శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై అమెరికా జరిపిన సబ్‌మెరైన్ అటాక్
- హిందూ మహాసముద్రంలో మునిగిపోయిన ఐరిస్ దెనా యుద్ధనౌక

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌ను చంపేస్తాం



03

- ఇజ్రాయిల్, యూఎస్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి
- తండ్రి వారసుడిగా పగ్గాలు చేపట్టిన కుమారుడు మొజ్తాబా ఖమేనీ
- నియామకం జరిగిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయిల్ నుంచి తీవ్ర హెచ్చరిక
- ఇరాన్ కొత్త నేతను కూడా అంతం చేస్తామన్న రక్షణ మంత్రి కాట్జ్
- ఇరాన్‌లో పాలనను కూల్చేందుకు అమెరికాతో కలిసి ఇజ్రాయిల్ వ్యూహం
- మషాద్‌లో ఖమేనీ అంత్యక్రియలకు ఏర్పాట్లు.. ఉద్రిక్తంగా పశ్చిమాసియా

## ఇరాన్ భీకర దాడులు

- ఐదో రోజుకు చేరిన ఉద్రిక్తతలు.. ఇరాన్ క్షిపణి దాడుల ఉధృతి
- అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలే టార్గెట్‌గా 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4'
- కువైట్, ఖతార్, ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై 230 డ్రోన్లతో దాడి
- హిందూ మహాసముద్రంలో అమెరికా యుద్ధనౌక, ట్యాంకర్‌పై విరుచుకుపడ్డ క్షిపణులు
- హోర్ముజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ సాధించినట్లు ఇరాన్ ప్రకటన
- ట్రంప్ హెచ్చరికలకు కౌంటర్‌గా నౌకలను ధ్వంసం చేస్తామని ఐఆర్‌జీసీ వార్నింగ్

03



## ఐఏఎస్, ఐపీఎస్‌లను సీఎం బెదిరిస్తున్నారు

- సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టులేదు
- అధికారుల బదిలీలతో వ్యవస్థ కుంటుపడింది
- కలెక్టర్ల సదస్సులో సీఎం బెదిరింపు ధోరణి
- జీహెచ్ఎంసీకి నలుగురు కమిషనర్ల మార్పు
- పోస్టింగ్‌లు ఇచ్చినా విధుల్లోకి తీసుకోని వైనం
- కాంగ్రెస్ అవినీతి చిట్టాను త్వరలో బయటపెడతాం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. ముఖ్యంగా పరిపాలనా పరమైన నిర్ణయాలు, అధికారుల బదిలీల అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరిపాలన పట్ల కనీస అవగాహన లేదని, ఆయన తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర యంత్రాంగం పడకేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ తీరు వల్ల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 3లో..




## అమెరికా రాడార్ కేంద్రం ధ్వంసం

- అమెరికాకు చెందిన భారీ రాడార్‌ను ధ్వంసం చేసిన ఇరాన్
- అల్ ఉదెయిద్ ఎయిర్ బేస్ వద్ద దాడి జరిగినట్లు అధికారిక ప్రకటన
- 5,000 కిలోమీటర్ల పరిధి కలిగిన రాడార్ వ్యవస్థ నేలమట్టం
- 1.1 బిలియన్ డాలర్ల విలువైన రక్షణ సంపదకు భారీ నష్టం
- గల్ఫ్ దేశాల గగనతల రక్షణపై పడనున్న తీవ్ర ప్రభావం
- ఇరాన్-అమెరికా మధ్య మరింత ముదిరిన ప్రతీకార సెగలు

05

# నేనున్నాను మిత్రమా..!

- పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు
- కీలకమైన 'హోర్మూజ్ జలసంధి'ని మూసివేసిన ఇరాన్
- భారత ముడి చమురు, ఎల్పీజీ దిగుమతులకు తీవ్ర ఆటంకం
- సంక్షోభ సమయంలో ఆపన్నహస్తం అందిస్తున్న రష్యా
- ప్రస్తుతానికి భారత్ వద్ద 50 రోజులకు సరిపడా నిల్వలు
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం



**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం యావత్ ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య రాజుకున్న నిప్పు.. గల్ఫ్ దేశాలకు వ్యాపించడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరా వ్యవస్థ తలకిందులయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా అమెరికా అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులు, దానికి ప్రతిగా ఇరాన్ తన పంథాను మార్చుకోవడం గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలను పరాకాష్టకు చేర్చాయి. అమెరికా మిత్రదేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాలపై కూడా ప్రతీకార దాడులు జరుగుతుండటంతో ప్రపంచ దేశాల చూపు

మిగతా 2లో..

## వార్‌జోన్..రూ.10 లక్షల కోట్లు ఆవిరి

### సెన్సెక్స్ 1100 పాయింట్లు, నిఫ్టీ 385 పాయింట్లు క్రాష్

- ఇన్వెస్టర్ల సొమ్ము రూ.10 లక్షల కోట్లు గాల్లో కలిసిపోయాయి
- బ్రెంట్ క్రూడ్ 82 డాలర్లకు చేరడంతో ద్రవ్యోల్బణ సెగ
- ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలు ఐదో రోజుకు చేరడంపై ఆందోళన
- యుద్ధం మరో ఐదు వారాలు కొనసాగవచ్చని అమెరికా ప్రకటన
- విదేశీ మదుపరుల అమ్మకాలతో రూపాయి విలువపై ఒత్తిడి

**విశాలభారతి, జాతీయం:**

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ జ్వాలలు గ్లోబల్ మార్కెట్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఐదో రోజుకు చేరుకున్న దాడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదని, మరో నాలుగు నుండి ఐదు వారాల పాటు కొనసాగే అవకాశం ఉందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన ఇన్వెస్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. దీని ప్రభావంతో భారతీయ మార్కెట్లు బుధవారం ఒక్కసారిగా కుప్పకూలాయి.

మిగతా 3లో..



# ఇరాన్ నౌకను ముంచేసిన అగ్రరాజ్యం

- శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై అమెరికా జరిపిన సబ్‌మెరైన్ అటాక్
- హిందూ మహాసముద్రంలో మునిగిపోయిన ఐరిస్ డెనా యుద్ధనౌక
- దాడిలో 101 మంది గల్లంతు, 74 మందికి తీవ్ర గాయాలు
- బాధితులను రక్షించిన శ్రీలంక నావికాదళం; గాలే ఆస్పత్రికి తరలింపు
- విశాఖలో ఐఎఫ్ఆర్ వేడుకలు ముగించుకుని తిరిగి వెళ్తుండగా ప్రమాదం
- ఇరాన్ సైనిక వ్యవస్థను నిర్వీర్యం చేశామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు ఇప్పుడు హిందూ మహాసముద్రానికి పాకాయి. గత కొంతకాలంగా అమెరికా, ఇజ్రాయెల్ కూటమి దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఇరాన్‌కు మరో కోలుకోలేని దెబ్బ తగిలింది. శ్రీలంక తీరానికి సమీపంలో అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తున్న ఇరాన్ యుద్ధ నౌక 'ఐరిస్ డెనా'ను అమెరికా సైన్యం సబ్‌మెరైన్ ద్వారా లక్ష్యంగా చేసుకుని కూల్చివేసింది. ఈ మెరుపు దాడితో భారీ నౌక సముద్ర గర్భంలో కలిసిపోయింది. అగ్రరాజ్యం అమెరికా రక్షణ మంత్రి హెగ్‌సెత్ ఈ దాడిని ధృవీకరించారు. ప్రస్తుతం పశ్చిమాసియా ప్రాంతం అగ్నిగుండంలా మారింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు కనివిని ఎరుగని రీతిలో బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. ఈ దాడుల ధాటికి టెహ్రాన్ నగరం ఛిన్నాభిన్నమైంది. అనేక కీలక ప్రభుత్వ భవనాలు, సైనిక స్థావరాలు నేలమట్టమయ్యాయి. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, రాడార్ వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేశామని సాక్షాత్తు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

ఈ భీకర పోరాటం మధ్యలో ఇరాన్ నేవీకి చెందిన ప్రతిష్టాత్మక యుద్ధనౌక ఐరిస్ డెనా శ్రీలంకలోని గాలే తీరానికి సమీపంలో ప్రయాణిస్తుండగా అమెరికా సబ్‌మెరైన్ దానిపై టార్పెడోలతో విరుచుకుపడింది. ఊహించని ఈ దాడితో నౌక భారీ శబ్దంతో పేలిపోయి నీటిలో మునిగిపోయింది. రాయిటర్స్ సంస్థ కథనం ప్రకారం, ఈ ప్రమాద సమయంలో నౌకలో ఉన్న వారిలో 101 మంది జాడ తెలియకుండా పోయారు. మరో 74 మంది తీవ్రంగా గాయపడగా, వారిని ప్రాణాపాయ స్థితిలో రక్షించారు.

నౌక మునిగిపోయే క్రమంలో దాని నుంచి అత్యవసర సంకేతాలు వెలువడ్డాయి. వీటిని గుర్తించిన శ్రీలంక నావికాదళం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. శ్రీలంక నేవీ సిబ్బంది ధైర్యసాహసాలతో సముద్రంలో మునిగిపోతున్న సుమారు 30 మందిని ప్రాణాలతో బయటకు తీయగలిగారు. క్షతగాత్రులను వెంటనే గాలే నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హేరత్ ఈ ఘటనపై స్పందిస్తూ, అంతర్జాతీయ జలాల్లో జరిగిన ఈ దాడిలో ప్రాణనష్టం తగ్గించేందుకు తమ నావికాదళం శ్రమిస్తోందని తెలిపారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం హెలికాప్టర్లు, గస్తీ నౌకలను రంగంలోకి దించామని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై అమెరికా అధికారికంగా బాధ్యత వహించడంతో అంతర్జాతీయంగా దౌత్యపరమైన ఉత్కంఠ నెలకొంది. ఇరాన్ నౌకలను ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా వదిలిపెట్టబోమని అమెరికా సంకేతాలిస్తోంది.

ఈ ఐరిస్ డెనా నౌకకు భారతదేశంతో ఒక ప్రత్యేక అనుబంధం ఉంది. గత నెల 17వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఘనంగా జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ వేడుకల్లో ఈ నౌక పాల్గొంది. వివిధ దేశాల నౌకాదళాలతో కలిసి విన్యాసాల్లో పాలుపంచుకున్న ఈ యుద్ధనౌక, కార్యక్రమం ముగించుకుని తిరిగి తన మాతృదేశానికి వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదానికి గురైంది. భారత తీరం నుంచి బయలుదేరిన కొన్ని రోజులకే ఇది సముద్రంలో కలిసిపోవడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలోని యంత్రాంగం ఇరాన్‌ను ఆర్థికంగా, సైనికంగా పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇరాన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ విభాగాలను ఇప్పటికే నిర్వీర్యం చేశామని, ఇకపై ఆ దేశం నుంచి ఎలాంటి ప్రతిఘటన ఉండబోదని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. తాజా నౌక ధ్వంసం ఘటనతో ఇరాన్ నౌకాదళం కూడా పెద్ద ఎత్తున నష్టపోయింది. పశ్చిమాసియా సంక్షోభం ఇప్పుడు ఇతర సముద్ర మార్గాలకు కూడా విస్తరించడం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది.

హిందూ మహాసముద్రంలో జరిగిన ఈ దాడి సముద్ర భద్రతపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. సాధారణంగా ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో యుద్ధనౌకపై సబ్‌మెరైన్ దాడి జరగడం ప్రపంచ వాణిజ్య మార్గాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అమెరికా తన అత్యాధునిక జలాంతర్గాములను ఉపయోగించి నిఘా పెంచడమే కాకుండా, శత్రువుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఇరాన్ నౌక కదలికలను పక్కాగా పసిగట్టిన అమెరికా నేవీ, సరైన సమయంలో దాడి చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వం ఈ దాడిని తీవ్రంగా ఖండించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆ దేశం అంతర్గతంగా, సరిహద్దుల్లో ఎదుర్కొంటున్న సవాళ్ల దృష్ట్యా గట్టిగా స్పందించే స్థితిలో లేదు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్ రక్షణ వ్యవస్థలు ఇప్పటికే చిందరవందర అయ్యాయి. దేశంలోని కీలక మౌలిక సదుపాయాలు ధ్వంసం కావడంతో ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి క్లిష్ట సమయంలో యుద్ధనౌక మునిగిపోవడం ఇరాన్ నైతిక స్థైర్యాన్ని మరింత దెబ్బతీసే అంశం. మొత్తానికి శ్రీలంక తీరంలో జరిగిన ఈ ఘటన అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. విశాఖ తీరంలో మెరిసిన ఒక యుద్ధనౌక, కొన్ని రోజుల వ్యవధిలోనే క్షిపణి దాడికి గురై సముద్ర గర్భంలో సమాధి కావడం విషాదకరం. అగ్రరాజ్యం తన పంతాన్ని నెగ్గించుకునే క్రమంలో పశ్చిమాసియా యుద్ధాన్ని సముద్రాల మీదుగా ప్రపంచవ్యాప్తం చేస్తోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ ఉద్రిక్తతలు ఇంకా ఎటు దారితీస్తాయోనన్న భయం అంతర్జాతీయ సమాజంలో వ్యక్తమవుతోంది.

## ప్రజలకు బాధ్యతాయుత సేవలే లక్ష్యంగా పనిచేయాలి




- సర్పంచ్‌లు, వార్డులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచన
- గ్రామ అభివృద్ధికి పునాది గ్రామపంచాయతీ వ్యవస్థ
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే ప్రజాప్రతినిధుల ధర్మం
- సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలంటే పటిష్ట నాయకత్వం అవసరం

**అశ్వారావుపేట |విశాల భారతి**

అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని రైతు వేదికలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో తాజాగా విజయం సాధించిన వార్డు సభ్యుల కోసం మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ కార్యక్రమాలు మూడు విభాగాలుగా నిర్వహించనుండగా, తొలి విడత శిక్షణను ముఖ్య అతిథిగా హాజరైన జారె ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ వ్యవస్థ గ్రామ అభివృద్ధికి పునాది రాయి వంటిదని, మౌలిక వసతులు, ప్రాథమిక అవసరాల పరిష్కారంలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి ధర్మమని, ప్రజా అవసరాలకు అనుగుణంగా పనిచేసినప్పుడే గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలంటే గ్రామస్థాయిలో పటిష్టమైన నాయకత్వం అవసరమన్నారు. గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను సమన్వయంతో పరిష్కరించి, ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్ర రావు, ఎంపీడీవో అప్పారావు, ఎంపీఓ రామకోటారెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సజావుగా సాగింది.

# నేనున్నాను మిత్రమా..!

**మొదటిపేజీ తరువాయి**



ఇప్పుడు చమురు బావుల వైపు మళ్లింది. అంతర్జాతీయ వాణిజ్యానికి గుండెకాయ వంటి 'హోర్ముజ్ జలసంధి'ని ఇరాన్ మూసివేయడం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా జరిగే చమురు రవాణాలో దాదాపు 20 శాతం వాటా ఈ ఇరుకైన సముద్ర మార్గం గుండానే సాగుతుంది. ఇది కేవలం ఒక మార్గం మాత్రమే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆక్సిజన్ అందించే ధమని. ఈ మార్గం మూతపడటం వల్ల గల్ఫ్ నుంచి రావాల్సిన నౌకలు నిలిచిపోయి, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకే ప్రమాదం పొంచి ఉంది. ఫలితంగా భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు సవాళ్లు మొదలయ్యాయి. భారతదేశ ఇంధన భద్రతకు ఈ హోర్ముజ్ జలసంధి అత్యంత కీలకం. మన దేశానికి వచ్చే ముడి చమురు, ఎల్పీజీ దిగుమతుల్లో దాదాపు సగం వాటా ఈ మార్గం నుంచే వస్తుంది. అంతేకాకుండా, ప్రపంచ ఎల్ఎన్జీ సరఫరాలో 20 శాతం దీనిపైనే ఆధారపడి ఉండటం వల్ల గ్యాస్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. దేశీయంగా వంటగ్యాస్ నుంచి వాహనాల ఇంధనం వరకు ప్రతిదీ ఈ జలసంధి గుండా వచ్చే నౌకల పైనే ఆధారపడి ఉండటంతో, ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక స్థితిగతుల పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో భారత్‌కు అత్యంత నమ్మకమైన మిత్రదేశం రష్యా మరోసారి అండగా నిలిచింది. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న అస్థిరత కారణంగా సరఫరాకు అంతరాయం కలిగితే, భారత్‌కు కావాల్సిన చమురును నిరంతరాయంగా అందిస్తామని క్రెమ్లిన్ ప్రకటించడం ఊరటనిచ్చే అంశం. గతంలో కూడా అనేక అంతర్జాతీయ ఆంక్షలను ధిక్కరించి రష్యా భారత్‌కు తక్కువ ధరకే చమురును విక్రయించింది. ఇప్పుడు గల్ఫ్ సంక్షోభం నేపథ్యంలో రష్యా తన ఎగుమతులను మరింత పెంచేందుకు సిద్ధంగా ఉండటం వల్ల భారత్‌కు ఇంధన భద్రత విషయంలో కొంత ధీమా లభిస్తోంది ప్రస్తుతానికి భారత్‌లో ఇంధన కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. దేశం వద్ద తక్షణ అవసరాల కోసం 25 రోజుల ముడి చమురు నిల్వలు ఉన్నాయి. దీనికి అదనంగా మరో 25 రోజులకు సరిపడా పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. అంటే మొత్తం మీద 50 రోజుల వరకు దేశీయ అవసరాలకు ఎటువంటి డోకా లేదు. ఈ వ్యూహాత్మక నిల్వలు సంక్షోభ సమయాల్లో దేశానికి రక్షణ కవచంలా పనిచేస్తాయి. అయినప్పటికీ, యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రపంచ ఇంధన మార్కెట్లో భారత్ ఒక శక్తివంతమైన దేశంగా ఎదిగింది. మనం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ముడి చమురు దిగుమతిదారుగా ఉన్నాం. అంతేకాకుండా, ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం మన సొంతం. ముడి చమురును శుద్ధి చేసి పెట్రోలియం ఉత్పత్తులుగా మార్చి ఎగుమతి చేయడంలో భారత్ ఐదో స్థానంలో నిలవడం విశేషం. ఈ బలమైన మౌలిక సదుపాయాలు ఉండటం వల్లే, విదేశీ ముడి చమురు సరఫరా తగ్గినా, మనం దాన్ని సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నాం. రష్యా నుంచి వచ్చే చమురును శుద్ధి చేసి ఇతర దేశాలకు పంపే సామర్థ్యం మనకు ఉంది.

గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు రోజురోజుకూ విషమిస్తుండటంతో భారత్ తన దౌత్యపరమైన వ్యూహాలకు పదును పెడుతోంది. ఒకవైపు రష్యాతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే, మరోవైపు ఇతర దేశాల నుంచి చమురు దిగుమతులకు మార్గాలను అన్వేషిస్తోంది. ఇరాన్‌ఇజ్రాయిల్ యుద్ధం వల్ల చమురు నౌకల ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెరగడం, రవాణా ఖర్చులు భారం కావడం వంటివి భారత్ పై ఆర్థిక ఒత్తిడిని పెంచుతాయి. రష్యా నుంచి డిస్కౌంట్ ధరకు చమురు లభిస్తే తప్ప, ఈ అదనపు భారాన్ని భరించడం కష్టమవుతుంది. అందువల్ల ప్రభుత్వం రష్యాతో దీర్ఘకాలిక ఒప్పందాలపై దృష్టి పెట్టింది.

యుద్ధం వల్ల కేవలం చమురు సరఫరా మాత్రమే కాదు, డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోయే ప్రమాదం ఉంది. ముడి చమురు ధర పెరిగితే ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసరాల ధరలు సామాన్యుడికి భారంగా మారుతాయి. అందుకే ప్రభుత్వం యుద్ధం త్వరగా ముగియాలని కోరుకుంటూనే, మరోవైపు యుద్ధం కొనసాగితే ఎదురయ్యే ఆర్థిక పరిణామాలను తట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయ కార్మికుల భద్రత కూడా ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది. వారి నుంచి వచ్చే రెమిటెన్స్ లు కూడా భారత ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యం. చారిత్రాత్మకంగా భారత్ ఎప్పుడూ రష్యాతో మంచి సంబంధాలను కలిగి ఉంది. అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ, తన జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఇప్పుడు హోర్ముజ్ జలసంధి మూసివేత వల్ల గల్ఫ్ దేశాల నుంచి నౌకలు రావడం అసాధ్యం అయితే, రష్యా నుంచి పైపులైన్లు లేదా ఉత్తర సముద్ర మార్గాల ద్వారా చమురు తెచ్చుకోవడంపై నిపుణులు చర్చిస్తున్నారు. ఇది కొంత ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికీ, దేశ ఇంధన అవసరాలు తీర్చడానికి ఇది తప్పనిసరి మార్గంగా కనిపిస్తోంది.

మొత్తానికి పశ్చిమాసియా రణరంగం భారత్ కు ఒక పరీక్షా సమయం. చమురు భద్రత అనేది కేవలం ఒక వస్తువు సరఫరాకు సంబంధించినది కాదు, అది దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్థిరత్వంతో ముడిపడి ఉంది. రష్యా వంటి మిత్రదేశాల సహకారం, దేశీయంగా ఉన్న భారీ నిల్వలు భారత్‌ను ఈ గండం నుంచి గట్టెక్కిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా, గల్ఫ్ లో శాంతి నెలకొనడమే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు. అంతవరకు భారత్ అప్రమత్తంగా ఉంటూ తన వ్యూహాలను నిరంతరం సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రాజ్యసభకు రేవంత్ మార్క్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**





తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా ఉత్కంఠ రేపుతున్న రాజ్యసభ స్థానాల భర్తీ ప్రక్రియ ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. అధికార కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థుల ఎంపికలో అటు ప్రాంతీయ విధేయతకు, ఇటు జాతీయ అవసరాలకు సమతుల్యత పాటిస్తూ తుది నిర్ణయాన్ని ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత ఆప్తుడు, ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వేం నరేందర్‌రెడ్డితో పాటు, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గొంతుకగా నిలిచే ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి పేర్లను అధిష్టానం ఖరారు చేసింది. ఈ నిర్ణయంతో గాంధీ భవన్‌లో సందడి నెలకొనగా, అభ్యర్థులు గురువారం తమ నామినేషన్ పత్రాలను సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఈ ఎంపిక ప్రక్రియలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన ముద్ర వేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి పార్టీ కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన వేం నరేందర్‌రెడ్డికి ఈ అవకాశం దక్కడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. నరేందర్‌రెడ్డి కేవలం ఒక నాయకుడిగానే కాకుండా, రేవంత్ రెడ్డికి వెన్నంటి ఉండే వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వ పరంగా కీలక నిర్ణయాల్లో తనదైన పాత్ర పోషిస్తున్న ఆయనను పెద్దల సభకు పంపాలని నిర్ణయించడం ద్వారా, కష్టపడిన కార్యకర్తలకు, విధేయులకు తగిన గుర్తింపు లభిస్తుందనే సంకేతాన్ని అధిష్టానం పంపింది. మరోవైపు, అభిషేక్ మను సింఘ్విని తెలంగాణ నుంచి బరిలోకి దింపడం వెనుక అధిష్టానం పెద్ద వ్యూహమే ఉన్నట్లు కనిపిస్తోంది. జాతీయ రాజకీయాల్లో ఆరితేరిన నాయకుడిగా, పార్లమెంటులో విపక్షాల వాణిని బలంగా వినిపించే మేధావిగా సింఘ్వికి మంచి గుర్తింపు ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా, చట్టసభల్లో గట్టిగా వాదించగల సమర్థుడైన నాయకుడు అవసరమని భావించిన ఏఐసీసీ నాయకత్వం, ఆయన పేరును పరిశీలనలోకి తీసుకుంది. ఈ నిర్ణయంతో అటు రాష్ట్ర అభివృద్ధికి, ఇటు జాతీయ స్థాయిలో పార్టీ బలోపేతానికి మార్గం సుగమం అవుతుందని కాంగ్రెస్ శ్రేణులు విశ్వసిస్తున్నాయి. అభ్యర్థుల ఖరారుకు ముందు ఢిల్లీ వేదికగా హైడ్రామా నడిచింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వంటి అగ్రనేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ ద్వారా సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రాష్ట్రంలోని సామాజిక సమీకరణాలు, కులగణన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భవిష్యత్తు రాజకీయ పరిణామాలు వంటి అనేక అంశాలను ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అన్ని కోణాల్లో విశ్లేషించిన తర్వాతే ఖర్గే ఈ ఇద్దరు పేర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనితో గత కొద్ది రోజులుగా సాగుతున్న ప్రచారానికి తెరపడి, అభ్యర్థుల ఖరారుపై స్పష్టత వచ్చింది.

వేం నరేందర్‌రెడ్డి ఎంపిక కేవలం స్నేహానికి ఇచ్చిన విలువ మాత్రమే కాదని, ఆయనకున్న రాజకీయ అనుభవం కూడా తోడైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్ర కాలం నుండి రాజకీయాల్లో చురుగ్గా ఉన్న ఆయనకు క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతపై పూర్తి అవగాహన ఉంది. ముఖ్యంగా తెలంగాణలో కాంగ్రెస్ పునర్వైభవం సాధించడంలో రేవంత్ రెడ్డికి ఆయన కుడిభుజంలా వ్యవహరించారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు కూడా వెనకడుగు వేయకుండా పోరాడిన నరేందర్‌రెడ్డికి రాజ్యసభ సభ్యత్వం దక్కడం సముచితమని పార్టీ వర్గాలు సంబరపడుతున్నాయి. సామాజికంగా కూడా సమతుల్యత పాటిస్తూ ఈ ఎంపిక జరిగినట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయిలో చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే అభిషేక్ మను సింఘ్వికి గతంలో హిమాచల్ ప్రదేశ్‌లో చేదు అనుభవం ఎదురైన సంగతి తెలిసిందే. అప్పట్లో తృటిలో అవకాశం కోల్పోయిన ఆయనను, ఈసారి అత్యంత సురక్షితమైన తెలంగాణ స్థానం నుంచి పంపాలని అధిష్టానం గట్టిగా నిర్ణయించుకుంది. తెలంగాణ నుంచి ఆయన ప్రాతినిధ్యం వహించడం వల్ల రాష్ట్ర సమస్యలపై పార్లమెంటులో మేధోపరమైన చర్చలు జరుగుతాయని, తద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో ఒత్తిడి తీసుకురావచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది. రాష్ట్ర అసెంబ్లీలో ప్రస్తుతమున్న బలాబలాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడకలాగే కనిపిస్తోంది. మెజారిటీ సభ్యుల మద్దతు ఉండటంతో ఎలాంటి అడ్డంకులు లేకుండానే వీరిద్దరూ పెద్దల సభలో అడుగుపెట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విపక్షాలు పోటీకి దిగే అవకాశం తక్కువగా ఉన్న నేపథ్యంలో, ఏకగ్రీవం అయ్యే అవకాశాలనే ఎక్కువగా పరిశీలిస్తున్నారు. ఏదేమైనా రేవంత్ రెడ్డి తన టీమ్ లోని కీలక నేతలకు ప్రాధాన్యత ఇస్తూనే, అధిష్టానం మాటను గౌరవిస్తూ సింఘ్వికి చోటు కల్పించడం ఆయన రాజకీయ చతురతకు నిదర్శనంగా నిలుస్తోంది. నామినేషన్ల దాఖలుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం ముహూర్తం ప్రకారం అభ్యర్థులు అసెంబ్లీ సెక్రటరీకి తమ పత్రాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. నామినేషన్ల అనంతరం పార్టీ తరపున ఒక భారీ ప్రదర్శన నిర్వహించే ఆలోచనలో కూడా నేతలు ఉన్నారు. ఈ విజయంతో పార్టీలో మరింత ఉత్సాహం నిండుతుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇది ఒక మంచి ఊపునిస్తుందని నాయకులు భావిస్తున్నారు. ఈ ఎంపిక ద్వారా సామాజిక న్యాయం పాటించలేదనే విమర్శలు రాకుండా కాంగ్రెస్ జాగ్రత్తలు తీసుకుంది. వేం నరేందర్‌రెడ్డి రూపంలో స్థానిక నేతకు, సింఘ్వి రూపంలో మేధావి వర్గానికి ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా పార్టీలో సమతుల్యత దెబ్బతినకుండా చూశారు. అలాగే పీసీసీ చీఫ్ గా మహేష్ గౌడ్ బాధ్యతలు చేపట్టాక జరిగిన మొదటి ప్రధాన రాజకీయ పరిణామం కావడంతో, ఆయన కూడా ఈ ఎంపిక ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరించారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మొత్తానికి తెలంగాణ రాజ్యసభ స్థానాల భర్తీ ప్రక్రియ సజావుగా ముగియడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. అటు పాలనలో, ఇటు పార్టీ వ్యవహారాల్లో రేవంత్ రెడ్డి తన పట్టును నిరూపించుకున్నారు. పెద్దల సభలో తెలంగాణ గొంతుక వినిపించేందుకు సిద్ధమవుతున్న ఈ ఇద్దరు నాయకులు భవిష్యత్తులో రాష్ట్రానికి ఎలాంటి మేలు చేస్తారో చూడాలి. ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ముగియడమే తరువాయి, కొత్త సభ్యులు ఢిల్లీ వెళ్లడానికి సర్వం సిద్ధమైంది.

# చమురు యుద్ధం..!

**మొదటిపేజీ తరువాయి**

షా కాలంలో మిత్రులుగా ఉన్న ఇజ్రాయెల్‌ఇరాన్‌లు, విప్లవం తర్వాత బద్ధ శత్రువులుగా మారిపోయాయి. పశ్చిమాసియాలో అమెరికా తన అగ్రరాజ్య హోదాను కాపాడుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది. చమురు నిల్వలు పుష్కలంగా ఉన్న ఈ ప్రాంతంలో రష్యా, చైనాల ప్రాబల్యం పెరిగితే తన ఆర్థిక ప్రయోజనాలకు గండిపడుతుందని వాషింగ్టన్ భయం. అయితే ఇరాన్ మాత్రం లెబనాన్, సిరియా, యెమెన్ వంటి దేశాల్లోని అమెరికా వ్యతిరేక బృందాలకు మద్దతు ఇస్తూ అగ్రరాజ్యానికి సవాలు విసురుతోంది. మరోవైపు ఇరాన్ రూపొందిస్తున్న ఖండాంతర క్షిపణులు, అణ్వాయుధాల తయారీ దిశగా వేస్తున్న అడుగులు తమ ఉనికికే ముప్పని ఇజ్రాయెల్ ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలోనే 2015లో కుదిరిన అణు ఒప్పందం నుంచి 2018లో ట్రంప్ ఏకపక్షంగా బయటకు రావడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. గత ఏడాది కాలంగా ఈ యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. హమాస్, హెజ్బొల్లా వంటి సంస్థలకు ఇరాన్ ఇస్తున్న దన్నుతో ఇజ్రాయెల్ తీవ్రంగా నష్టపోయింది. ఇరాన్ అణ్వాయుధాలను సిద్ధం చేసుకుంటే తమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని భావించిన ఇజ్రాయెల్, 2025 జూన్‌లో ఇరాన్‌పై నేరుగా దాడులకు దిగింది. మిత్రదేశానికి మద్దతుగా అమెరికా సైతం రంగంలోకి దిగి ఇరాన్‌లోని కీలక అణు కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించింది. జూన్ 24న తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ, ఇరాన్ అణు కార్యకలాపాలు ఆపలేదన్న సాకుతో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి.



ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ వివాదాన్ని వ్యక్తిగత, రాజకీయ కోణంలో కూడా చూస్తున్నారు. తనను హతమార్చడానికి ఇరాన్ కుట్ర పన్నిందని, దీని వెనుక ఖమేనీ హస్తం ఉందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఇరాన్‌లోని ఇస్లామిక్ ప్రభుత్వాన్ని కూల్చివేసి, అక్కడ తమకు అనుకూలమైన ప్రజాస్వామ్య వ్యవస్థను తీసుకురావడమే లక్ష్యమని ట్రంప్ బాహాటంగా ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఇరాన్ నాయకత్వాన్ని అంతం చేసే లక్ష్యంతో ఇజ్రాయెల్, అమెరికా కలిసికట్టుగా వ్యూహరచన చేస్తున్నాయి. ఈ దాడుల వెనుక కేవలం భద్రతా కారణాలే కాకుండా ఆర్థిక ప్రయోజనాలు కూడా ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ముఖ్యంగా 'డీ డాలరైజేషన్' అంశం అమెరికాను కలవరపెడుతోంది. 1970ల నుంచి చమురు విక్రయాలు కేవలం డాలర్లలోనే జరగాలన్న నిబంధన అమెరికా కరెన్సీని ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మార్చింది. అయితే ఇటీవల కాలంలో చాలా దేశాలు డాలర్‌పై ఆధారపడటం తగ్గిస్తున్నాయి. సౌదీ అరేబియా సైతం చైనా వంటి దేశాలకు ఇతర కరెన్సీల్లో చమురు విక్రయించేందుకు మొగ్గుచూపుతుండటం అమెరికాకు పెద్ద దెబ్బ. డాలర్ బలహీనపడితే అమెరికా తన అగ్రరాజ్య హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే చమురు సంపద ఉన్న దేశాలపై పట్టు సాధించి డాలర్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని వాషింగ్టన్ చూస్తోంది. ఈ ఏడాది జనవరిలో వెనిజులాపై దాడి చేసి అక్కడి అధ్యక్షుడు మదురోను బంధించడం ద్వారా చమురు నిల్వలపై కన్నేసిన అమెరికా, ఇప్పుడు తన దృష్టిని ఇరాన్ వైపు మళ్లించింది. ప్రపంచంలోనే అత్యధిక చమురు, సహజవాయువు నిల్వలు ఉన్న ఇరాన్‌ను నియంత్రించగలిగితే, ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లుగా అటు చమురు మార్కెట్‌ను, ఇటు డాలర్ డిమాండ్‌ను కాపాడుకోవచ్చని అమెరికా వ్యూహం. అలాగే ఇరాన్ నుంచి తక్కువ ధరకు చమురు పొందుతున్న చైనాను, చౌకగా డ్రోన్లు, క్షిపణులు పొందుతున్న రష్యాను దెబ్బతీయడం అమెరికా ప్రధాన ఎజెండాగా కనిపిస్తోంది. ఇరాన్ చమురులో దాదాపు 90 శాతం చైనానే కొనుగోలు చేస్తోంది, అది కూడా డాలర్లలో కాకుండా ఇతర మార్గాల్లో చెల్లింపులు జరుగుతున్నాయి. అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్ దిగి వచ్చి డిస్కౌంట్ ధరలకు చైనాకు చమురు విక్రయిస్తోంది. ఇప్పుడు యుద్ధం కారణంగా ఇరాన్ సరఫరా వ్యవస్థ దెబ్బతింటే చైనా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. అలాగే ఉక్రెయిన్ యుద్ధంలో ఇరాన్ ఆయుధాల సాయం పొందుతున్న రష్యాకు కూడా అడ్డంకులు ఎదురవుతాయి. వెరసి, ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అమెరికా తన ప్రత్యర్థి దేశాలైన చైనా, రష్యాలను ఏకకాలంలో ఇరకాటంలో పెట్టాలని చూస్తోంది.

## విఎన్ఆర్,విజేఐఈటి కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి

- చైర్మన్ సురేష్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- విద్యా సంస్థలలో విద్యార్థినిలకు రక్షణ కల్పించాలి
- మహిళ కమిషన్ కు పిర్యాదు
- ఓయూ జేఏసి నేతలు ఆర్.ఎన్ శంకర్,గడ్డం శ్యామ్




Date: 04/02/2026

To
Chairperson
Telangana State Commission for Women

Subject: Complaint against College Management for Negligence in Addressing Sexual Harassment and Rape Victim's Grievance Req.

Respected Sir,

I, Dr. R. N. Shankar, along with Mr. Gaddam Shyam and Mr. G Harinadh, student activist from Osmania University, Hyderabad, wish to bring to your notice the grave negligence and failure of the management of Vignana Jyothi Engineering College (VNR VJIET) in handling a rape victim's complaint.

The victim, Ms. Orsu Sharon, a student of VNR VJIET, has been subjected to sexual harassment and assault since 2023. The accused individuals are Mr. Sirra Ashish Thanay and Mr. Praveen, both from the same college and batch. An FIR has already been lodged in this matter (FIR No: 217/2026. Dated; 28-08-2026) copy enclosed and all relevant press information also enclosed)

Despite the victim's formal complaint to the college management at the initial stage of harassment, no inquiry was initiated, nor was any legitimate action taken against the respondents. As per the mandatory guidelines of the Ministry of Higher Education, every institution must conduct an inquiry through its Internal Complaints Committee (ICC). However, the college authorities failed to fulfil this obligation, thereby neglecting their duty to safeguard the dignity, safety, and integrity of their student.

Due to this prolonged negligence, the victim has continued to suffer sexual and physical harassment for over one and a half years. This inaction clearly reflects a serious lapse in responsibility and accountability on the part of the institution.

Therefore, we request that the concerned college management officials, namely:

- Dr. Chenakesava (Principal, VNR VJIET)
- Head of the Department of the Mechanical Department (VNR VJIET)
- Chairman VNR VJIET
- Mr. Praveen (Faculty – Alumni Association)

be included as Accused No. 3 (A3) in the FIR for their deliberate negligence and failure to act. We also urge strict institutional action against them to uphold the prestige of Telangana's educational system and ensure women's safety in academic institutions.

We trust that your esteemed office will take immediate and appropriate action to prevent further harassment and to restore faith in the protection mechanisms within our educational institutions.

Yours sincerely,

Dr. R. N. Shankar (9963169415)
Mr. Gaddam Shyam (9908415381), Mr. G Harinadh (9959932492)
(Student Activist, Osmania University, Hyderabad)

**విశాల భారతి హైదరాబాద్:** విఎన్ఆర్, విజేఐఈటి కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని, అదే విధంగా సంస్థ చైర్మన్ సురేష్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఓయూ జేఏసి నేతలు ఆర్.ఎన్ శంకర్,గడ్డం శ్యామ్ పేర్కొన్నారు.విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కాలేజ్ లో చదువుతున్న మహిళ విద్యార్థినిపై అదే కాలేజ్ లో చదువుతున్న యువకులు మత్తు చాకెట్లు ఇచ్చి బలవంతంగా లైంగిక దాడి పాల్పడ ఘటనపై చైర్మన్ సురేష్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బుదవారం మహిళ కమిషన్ కు పిర్యాదు చేశారు. అనంతరం వారు మహిళా కమిషన్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ నగరంలో ప్రఖ్యాతి గాంచిన కళాశాలగా ప్రచారం చేసుకుంటూ కోట్లాది రూపాయలు సంపాదిస్తూ మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన విఎన్ఆర్ విజ్ఞాన ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ దగ్గుపాటి సురేష్ నాయుడు, ప్రిన్సిపాల్ చెన్నకేశవరావు, సిడి నాయుడులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అక్టోబర్ 2024 కళాశాలలోని డి.బ్లాక్ రూమ్ నెంబర్ 33లో బాధిత అమ్మాయికి మత్తు చాకెట్లు ఇచ్చి యువకులు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఇదే విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్,డీన్ లకు అమ్మాయి పలుమార్లు పిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆ బాధిత మహిళ ఆత్మహత్యయత్నం చేసిందని పేర్కొన్నారు.కళాశాల యజమాన్యం తమకున్న ఆర్థిక రాజకీయ పలుకుబడితో తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని వారి నిర్లక్ష్య కారణంగానే 18 నెలలుగా బాధిత విద్యార్థి నరకయాతన అనుభవించిందని కనుక కళాశాల యాజమాన్యంపై ఎఫ్ఐఆర్లో నమోదు చేసి చట్టబద్ధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనియెడల కళాశాల ముందు ప్రత్యక్ష పోరాటం నిర్వహిస్తారని తెలియజేశారు.దాదాపు 3,000 మంది విద్యార్థులు చదువుతున్న కళాశాలలో విద్యార్థినిలకు రక్షణకు యజమాన్యం ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం సమాజంలో మహిళలను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర దాగుందని ఆరోపించారు.

# 'ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌ను చంపేస్తాం'

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో మునుపెన్నడూ లేని విధంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. దశాబ్దాలుగా ఇరాన్‌ను ఏకఛత్రాధిపత్యంతో పాలించిన సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ శకం ముగిసింది. గత శనివారం ఇజ్రాయిల్అమెరికా సంయుక్తంగా నిర్వహించిన భారీ వైమానిక దాడుల్లో ఖమేనీ హతమవ్వడం అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ దాడి కేవలం ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్నది కాదు, ఇరాన్ మొత్తం పాలనా యంత్రాంగాన్ని దెబ్బతీసేలా సాగింది. ఖమేనీతో పాటు ఇరాన్ మిలిటరీకి చెందిన టాప్ జనరల్స్, ఉన్నతాధికారులు కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోవడంతో ఇరాన్ కోలుకోలేని దెబ్బతింది. కేవలం రాజకీయ నేతలే కాకుండా, ఖమేనీ కుటుంబ సభ్యులైన ఆయన కుమార్తె, అల్లుడు,మనవరాలు కూడా ఈ దాడుల్లో మరణించడం ఆ దేశాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ తదుపరి వారసుడు ఎవరనే ఉత్కంఠకు తెరపడుతూ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇరాన్ ఎక్స్‌పర్ట్ అసెంబ్లీ అత్యవసరంగా సమావేశమై, ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఖమేనీని కొత్త సుప్రీం లీడర్‌గా ఎన్నుకుంది. వాస్తవానికి ఈ ఎన్నిక ప్రక్రియ వెనుక ఇరాన్ అత్యంత శక్తివంతమైన మిలిటరీ విభాగం 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్' ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. మొజ్తాబాకు సైన్యం నుంచి పూర్తి మద్దతు ఉండటంతో ఆయన నియామకం వేగంగా జరిగిపోయింది. 36 ఏళ్ల పాటు ఇరాన్‌ను శాసించిన తండ్రి స్థానంలో ఇప్పుడు కుమారుడు పగ్గాలు చేపట్టారు. అయితే ఈ మార్పు ఇరాన్‌లో స్థిరత్వాన్ని తెస్తుందని భావిస్తున్న తరుణంలో, ఇజ్రాయిల్ నుంచి వచ్చిన ఒక ప్రకటన ఆ దేశాన్ని వణికిస్తోంది.

మొజ్తాబా బాధ్యతలు చేపట్టిన కొన్ని గంటల్లోనే



ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. కొత్తగా ఎన్నికైన నాయకుడు ఎవరైనా సరే, తమ లక్ష్యం నుంచి తప్పించుకోలేరని ఆయన కుండబద్దలు కొట్టారు. ఇజ్రాయిల్‌ను నాశనం చేయాలని చూసే ఏ శక్తినైనా తాము భూస్థాపితం చేస్తామని కాట్జ్ హెచ్చరించారు. ఆయన తన పోస్ట్‌లో చాలా స్పష్టంగా, "అతడి పేరు ఏదైనా కావచ్చు, ఎక్కడ దాక్కున్నా సరే.. మేము వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని హిబ్రూ భాషలో రాశారు. ఇది కేవలం మాటల హెచ్చరిక మాత్రమే కాదు, ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌కు ఇజ్రాయిల్ జారీ చేసిన 'డెత్ వారెంట్' గా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు ఇరాన్ నూతన నాయకత్వంలో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి.

ఇజ్రాయిల్ సైన్యంకు కూడా కాట్జ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్ ఉగ్రవాద పాలనను అంతం చేసేందుకు అత్యంత సమర్థవంతంగా పనిచేయాలని, శత్రువుల స్థావరాలను ఏరిపారేయాలని ఆయన పిలుపునిచ్చారు. అమెరికా, స్వేచ్ఛా ప్రపంచం, ఇతర ప్రాంతీయ దేశాలకు ఇరాన్ ఒక ముప్పుగా మారిందని, ఆ ముప్పును శాశ్వతంగా తొలగించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ ప్రజలను అణచివేస్తున్న ఈ నియంతృత్వ పోకడలకు చరమగీతం పాడతామని కాట్జ్ గట్టిగా చెప్పారు. ఈ ప్రకటనతో ఇజ్రాయిల్ తన తదుపరి లక్ష్యాన్ని ఇప్పటికే నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో హెజ్బొల్లా, హమాస్ నేతలను హతమార్చిన తరహాలోనే ఇప్పుడు ఇరాన్ అగ్రనేతలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని ఇజ్రాయిల్ పరోక్షంగా చెప్పకనే చెప్పింది. మరోవైపు ఇరాన్‌లో అంతర్గత తిరుగుబాటును ప్రోత్సహించే దిశగా కూడా ఇజ్రాయిల్ పావులు కదుపుతోంది. ఇరాన్ ప్రజలు అక్కడి ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు కావాల్సిన అనుకూల పరిస్థితులను సృష్టించడానికి తాము అమెరికన్ మిత్రులతో కలిసి పనిచేస్తున్నట్లు కాట్జ్ వెల్లడించారు. అంటే ఇటు సైనిక పరంగా, అటు రాజకీయంగా ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేయాలని వ్యూహరచన జరుగుతోంది. అమెరికా అండదండలతో ఇరాన్ పాలనా వ్యవస్థను మార్చేందుకు ఇజ్రాయిల్ వేస్తున్న ఈ ఎత్తుగడలు అంతర్జాతీయ సమాజంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఇరాన్ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకుంటూనే, మరోవైపు ఆ దేశ అగ్రనేతలను వరుసగా మట్టుబెడుతూ ఇజ్రాయిల్ తన పంజా విసురుతోంది.

ఇరాన్ ఇంటర్నేషనల్ నివేదికల ప్రకారం, సుప్రీం లీడర్ ఎన్నిక ప్రక్రియలో రివల్యూషనరీ గార్డ్స్ పాత్ర అత్యంత కీలకంగా మారింది. సాధారణంగా ఇరాన్ రాజ్యాంగం ప్రకారం జరిగే ప్రక్రియను కాదని, సైన్యం తన పట్టును నిరూపించుకోవడానికి మొజ్తాబాను గద్దెనెక్కించింది. ఇరాన్ ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఒక బలమైన నాయకత్వం ఉండాలని సైన్యం భావిస్తోంది. అయితే తండ్రి మరణం తర్వాత మొజ్తాబాకు పాలనపై పట్టు సాధించడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా అస్థిరత నెలకొన్న సమయంలో, ఇజ్రాయిల్ నుంచి వస్తున్న నిరంతర హెచ్చరికలు ఆయనకు పెద్ద సవాలుగా మారనున్నాయి. తండ్రి నీడలో పెరిగిన మొజ్తాబా, ఇప్పుడు స్వయంగా ఇజ్రాయిల్ అగ్నిపరీక్షను ఎదుర్కోవాల్సి ఉంది. గత శనివారం జరిగిన వైమానిక దాడిలో ఖమేనీ నివాసం , కీలక కార్యాలయాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ దాడి ఎంత తీవ్రంగా ఉందంటే, ఖమేనీతో పాటు ఆయన కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఘటన ఇరాన్ ఇంటెలిజెన్స్ వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ 'మొసాద్' ఇరాన్ కేంద్రంలోకి చొచ్చుకుపోయి సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. ఖమేనీ ఎక్కడ ఉన్నారో, ఎప్పుడు దాడులు చేయాలో కచ్చితంగా ప్లాన్ చేసి మరీ ఇజ్రాయిల్ రంగంలోకి దిగింది. ఇరాన్ గడ్డపైనే ఆ దేశ అత్యున్నత నేతను హతమార్చడం ద్వారా ఇజ్రాయిల్ తన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఇది ఇరాన్ మిత్రదేశాలైన రష్యా, చైనాలకు కూడా ఒక హెచ్చరికగా మారింది. ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఆయన సొంత ఊరైన మషాద్‌లో ఖననం చేయనున్నట్లు సమాచారం అందుతోంది. ఈ అంత్యక్రియల సమయంలో ఇరాన్ ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి మొజ్తాబా తన తదుపరి కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ప్రజల్లో ఒక వర్గం సంతోషం వ్యక్తం చేస్తుండగా, ప్రభుత్వం మద్దతుదారులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దేశంలో పౌర యుద్ధం వచ్చే సూచనలు కూడా కనిపిస్తున్నాయని కొందరు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఇప్పుడు రెండుగా చీలిపోయే ప్రమాదం ఉందని, దీనిని ఇజ్రాయిల్ తన అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది.

# ఐఏఎస్, ఐపీఎస్‌లను సీఎం బెదిరిస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి**

గత పది నెలల కాలంలో జరిగిన పరిణామాలను విశ్లేషిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం బదిలీలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పదేపదే బదిలీ చేయడం ద్వారా పాలనను సీఎం రేవంత్ రెడ్డి అస్తవ్యస్తం చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కేవలం రెండున్నరేళ్ల కాలపరిమితిలో ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను మార్చడం ఏ ప్రభుత్వానికి తగదని ఆయన సూచించారు. ఒక అధికారి ఒక ప్రాంతంలో బాధ్యతలు చేపట్టి, అక్కడి పరిస్థితులు, ప్రజల సమస్యలపై కనీస అవగాహన పెంచుకునేలోపే వారిని మార్చడం వల్ల ప్రజాపాలన కుంటుపడుతోందని విమర్శించారు. అధికారులకు పని చేసే స్వేచ్ఛ లేకుండా చేయడం వల్ల అభివృద్ధి పనులు మందగించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ వంటి కీలకమైన విభాగంలో కమిషనర్లను తరచూ మార్చడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. స్వల్ప కాలంలోనే నలుగురు కమిషనర్లను మార్చడం వల్ల హైదరాబాద్ నగర అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని నగరంపై పట్టు సాధించాల్సిన అధికారులు, విధివిధానాలు రూపొందించేలోపే బదిలీ వేటు పడటం వల్ల పాలనలో స్థిరత్వం లోపించిందని దుయ్యబట్టారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమో, లేక మంత్రుల కోపతాపాల కోసమో అధికారులను బలిపశువులను చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి వ్యవహరించిన తీరును హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి అధికారులను సమన్వయం చేసుకోవాల్సింది పోయి, బెదిరింపు ధోరణిలో మాట్లాడటం సరికాదన్నారు. "మీరు పని చేయకపోతే ఇంటికి పంపిస్తాం" అన్న తరహాలో హెచ్చరికలు జారీ చేయడం వల్ల అధికారుల నైతిక బలం దెబ్బతింటుందని పేర్కొన్నారు. పరిపాలనలో అనుభవం లేని ముఖ్యమంత్రి, తన వైఫల్యాలను అధికారులపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే అధికారులకు ధైర్యం చెప్పాలే తప్ప, భయభ్రాంతులకు గురిచేయకూడదని గుర్తుచేశారు.



అధికారుల నియామకాల్లో కూడా ప్రభుత్వం అస్పష్టమైన వైఖరి అవలంబిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. కొందరు అధికారులకు పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, వారిని విధుల్లో చేర్చుకోకుండా వెయిటింగ్‌లో ఉంచడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇది అధికారులను అవమానించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. సీఎంకు లేదా సంబంధిత శాఖ మంత్రులకు నచ్చకపోతే తక్షణమే బదిలీ చేయడం అనేది ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిపాటిగా మారిందని విమర్శించారు. ఇలాంటి చర్యల వల్ల అధికారుల్లో అభద్రతా భావం పెరిగి, వారు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యమేలుతోందని, బినామీల వ్యవస్థ పెరిగిపోయిందని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే వ్యక్తులు, కొందరు మంత్రుల బినామీలు ప్రభుత్వ పథకాల్లో వేల కోట్ల రూపాయల దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, త్వరలోనే కాంగ్రెస్ నేతల అవినీతి చిట్టాను ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు. అధికార ముసుగులో జరుగుతున్న అక్రమాలను బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రతి అంశాన్ని సాక్ష్యాధారాలతో సహా ఎండగడతామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యలకే రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతున్నా, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రైతు రుణమాఫీ, మహిళలకు మహాలక్ష్మి పథకం వంటి వాగ్దానాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, అధికారులపై పెత్తనం చలాయించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనపై పట్టు పెంచుకోవాల్సిన ముఖ్యమంత్రి, నిరంతరం ప్రతిపక్షాలను తిట్టడానికే సమయం కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారులతో కలిసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. అప్పట్లో అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి చేరవేశామని చెప్పారు. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో అధికారులు తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత స్థాయి అధికారులను సీఎం ఒక సామాన్య కార్యకర్తల్లా చూస్తున్నారని, ఇది వ్యవస్థలకు తీరని నష్టం చేకూరుస్తుందని ఆయన హెచ్చరించారు.

రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే వారు ఎవరైనా పరిపాలనలో స్థిరత్వాన్ని కోరుకుంటారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు విశ్లేషించారు. తరచూ బదిలీలు చేయడం వల్ల ఫైళ్ల కదలిక మందగించిందని, కీలక నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని చెప్పారు. దీనివల్ల రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు తరలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పద్ధతిని మార్చుకుని, అధికారులను గౌరవిస్తూ పాలనపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలనలో పడుతున్న ఇబ్బందులను గమనిస్తున్నారని, త్వరలోనే వారికి బుద్ధి చెబుతారని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. విపక్ష నాయకుడిగా తాము ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూనే ఉంటామని, ప్రజల పక్షాన పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి అంటే కేవలం బదిలీలు, బెదిరింపులు కాదని, ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే అసలైన పాలన అని రేవంత్ రెడ్డి తెలుసుకోవాలని సూచించారు. ఇకనైనా రాజకీయాలు పక్కన పెట్టి, రాష్ట్ర ప్రగతి కోసం నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని కోరుతూ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఇరాన్ భీకర దాడులు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు పరాకాష్టకు చేరుకున్నాయి. అమెరికా వైఖరిపై ఆగ్రహంగా ఉన్న ఇరాన్, తన ప్రతిదాడులను ఊహించని రీతిలో తీవ్రతరం చేసింది. అగ్రరాజ్యం అమెరికాకు, దాని మిత్రదేశం ఇజ్రాయెల్‌కు గట్టి బుద్ధి చెప్పడమే లక్ష్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) రంగంలోకి దిగింది. ఇందులో భాగంగానే తాజాగా 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4' పేరుతో భారీ సైనిక చర్యను ప్రారంభించినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇరాన్ తన అమ్ములపొదిలోని శక్తివంతమైన క్షిపణులను ప్రయోగించింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన వ్యూహాత్మక స్థావరాలపై సుమారు 40 క్షిపణులను ప్రయోగించినట్లు ఇరాన్ వెల్లడించింది. ఇవి కేవలం హెచ్చరికలు మాత్రమే కాదని, క్షేత్రస్థాయిలో భారీ నష్టాన్ని కలిగించడమే తమ ఉద్దేశమని ఐఆర్‌జీసీ స్పష్టం చేసింది. ఈ దాడుల వల్ల ఆయా ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించాయి. ఇరాన్ వైమానిక దాడుల ధాటికి అగ్రరాజ్య రక్షణ కవచాలు ఎంతవరకు తట్టుకోగలవనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

క్షిపణులతోనే ఆగకుండా, ఇరాన్ తన డ్రోన్ శక్తిని కూడా ప్రదర్శించింది. కువైట్, ఖతార్, మరియు ఇరాక్ వంటి దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఏకంగా 230 డ్రోన్లను ప్రయోగించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత పెద్ద ఎత్తున డ్రోన్లతో విరుచుకుపడటం అమెరికా రక్షణ దళాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ డ్రోన్ల దాడి వల్ల పలు సైనిక స్థావరాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నట్లు సమాచారం అందుతోంది. ఇరాన్ టెక్నాలజీ ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో ఈ దాడులు నిరూపిస్తున్నాయని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.



జలభాగంలోనూ అమెరికాకు ఇరాన్ గట్టి సెగ తగిలిస్తోంది. హిందూ మహాసముద్రంలో గస్తీ కాస్తున్న ఒక అమెరికన్ యుద్ధనౌకపై ఐఆర్‌జీసీ విజయవంతంగా దాడి చేసినట్లు ప్రకటించింది. దాడి జరిగిన సమయంలో సదరు యుద్ధనౌక, ఒక అమెరికన్ ట్యాంకర్ నుంచి ఇంధనాన్ని నింపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు నేరుగా నౌకలను తాకడంతో రెండింటిలోనూ భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో సముద్ర మార్గాల్లో ప్రయాణించే అమెరికా నౌకలకు భద్రత కరువైందని, ఇరాన్ తన పరిధిని సముద్ర గర్భం వరకు విస్తరించిందని స్పష్టమవుతోంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. ఈ వ్యూహాత్మక జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, అక్కడ తామే బాస్ అని ఇరాన్ తేల్చి చెప్పింది. ప్రపంచ దేశాలకు సరఫరా అయ్యే చమురులో అత్యధిక భాగం ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉంటుంది. అటువంటి కీలక ప్రాంతాన్ని తమ గుప్పిట్లోకి తీసుకోవడం ద్వారా ఇరాన్ ప్రపంచ దేశాల నాడిని పట్టుకుంది. ఈ ప్రాంతంలో ఇరాన్ అనుమతి లేనిదే ఏ నౌక కదలడం సాధ్యం కాదనే సంకేతాలను పంపింది.

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఇరాన్ దీటుగా జవాబిచ్చింది. హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకలకు అమెరికా సైన్యం పూర్తి రక్షణ కల్పిస్తుందని ట్రంప్ చేసిన ప్రకటనను ఐఆర్‌జీసీ తోసిపుచ్చింది. ట్రంప్ మాటలు కేవలం ప్రగల్భాలేనని, క్షేత్రస్థాయిలో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని ఎద్దేవా చేసింది. అమెరికా రక్షణ కవచాలు తమ క్షిపణుల ముందు పనిచేయవని, తమ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్ సైనిక నాయకత్వం హెచ్చరికలు జారీ చేసింది. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలకు ఇరాన్ డెడ్ లైన్ విధించింది. తమ నిబంధనలను అతిక్రమించి లేదా అమెరికా రక్షణలో ప్రయాణించే ఏ నౌకనైనా సరే నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేస్తామని హెచ్చరించింది. ఇది కేవలం వాగ్వివాదం మాత్రమే కాదని, ఇప్పటికే జరిగిన దాడులే దానికి నిదర్శనమని పేర్కొంది. ఇరాన్ హెచ్చరికలతో చమురు రవాణా చేసే కంపెనీలు బెంబేలెత్తిపోతున్నాయి. ఈ ఉద్రిక్తతలు గనుక కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇరాన్ తన మిత్ర దేశాల మద్దతుతో అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేస్తోంది. అటు అమెరికా కూడా తన సైనిక బలగాలను ఈ ప్రాంతంలో మోహరిస్తోంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ ఇగో వార్ కారణంగా అమాయక ప్రజలు బలికావాల్సి వస్తోంది. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ఐక్యరాజ్యసమితి కోరుతున్నప్పటికీ, యుద్ధ క్షేత్రంలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. నేటి తరం యువతకు ఈ యుద్ధం కేవలం వార్తల్లో చూసే అంశం మాత్రమే కాదు, ఇది డిజిటల్ , డ్రోన్ వార్‌ఫేర్‌కు నిదర్శనం. సోషల్ మీడియాలో ఇరాన్ దాడులకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. యుద్ధం శైలి మారిందని, క్షిపణులు, అత్యాధునిక డ్రోన్లతో ప్రత్యర్థిని దెబ్బతీయడం ఇప్పుడు సర్వసాధారణమైందని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

# వార్‌జోన్..రూ.10 లక్షల కోట్లు ఆవిరి

**మొదటిపేజీ తరువాయి**

ఉదయం నుండే అమ్మకాల ఒత్తిడి మొదలవ్వగా, ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్, నిఫ్టీలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఒకానొక దశలో మార్కెట్ పతనం చూస్తుంటే ఇన్వెస్టర్లు బెంబేలెత్తిపోయారు. ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాక్ మూసివేయడం అసలు సమస్యకు కేంద్రబిందువుగా మారింది. ఈ జలసంధి ద్వారానే అత్యధిక శాతం ముడి చమురు రవాణా జరుగుతుంది. దీని మూసివేతతో సరఫరా గొలుసు దెబ్బతిని, అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర ఒక్కసారిగా 82 డాలర్లకు చేరింది. చమురు ధరలు పెరగడం అంటే భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు పెను శాపం. దేశీయంగా రవాణా ఖర్చులు పెరిగి, అది నిత్యావసర వస్తువుల ధరలపై ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ద్రవ్యోల్బణం మళ్ళీ అదుపు తప్పుతుందన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మార్కెట్ల పతనానికి మరో ప్రధాన కారణం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల భారీ అమ్మకాలు. యుద్ధ వాతావరణం నెలకొన్నప్పుడు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడని మదుపరులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుని సురక్షితమైన బంగారం వైపు మళ్లుతున్నారు. అందుకే అంతర్జాతీయంగా బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ప్రస్తుతం ఔన్స్ బంగారం 5185 డాలర్ల వద్ద ట్రేడవుతుండటం గమనార్హం. మన దేశ రూపాయి విలువ కూడా విదేశీ కరెన్సీల ఎదుట బలహీనపడటం మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. ఐటి రంగానికి చెందిన కొన్ని షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు నష్టాల బాట పట్టాయి.




సెన్సెక్స్ గణాంకాలను పరిశీలిస్తే, మార్చి 4వ తేదీ ట్రేడింగ్ ఆరంభమే ప్రతికూలంగా సాగింది. ఉదయం 78,528 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్, ఇంట్రాడేలో 78,443 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 1122 పాయింట్ల నష్టంతో 79,116 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 385 పాయింట్లు కోల్పోయి 24,480 స్థాయికి పడిపోయింది. ఈ ఒక్కరోజులోనే బిఎస్ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.10 లక్షల కోట్లు తగ్గిపోయింది. కంపెనీల మొత్తం విలువ రూ.456 లక్షల కోట్లకు చేరడంతో ఇన్వెస్టర్లు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. ఒకే రోజు ఇంత భారీ మొత్తంలో సంపద హరించుకుపోవడం ఈ మధ్య కాలంలో ఇదే మొదటిసారి. ముఖ్యంగా సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు భారీగా నష్టపోయాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ వంటి మౌలిక సదుపాయాల రంగ షేర్లు కూడా పతనమయ్యాయి. మార్కెట్ ఒడిదుడుకుల్లోనూ భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా వంటి కొన్ని ఐటి మరియు టెలికాం షేర్లు మాత్రమే స్వల్పంగా లాభపడి పరువు కాపాడుకున్నాయి. ఇన్వెస్టర్లు ఇప్పుడు ఏ రంగంలో పెట్టుబడులు పెట్టాలో తెలియక సందిగ్ధంలో పడ్డారు. యుద్ధం ఎంత కాలం కొనసాగుతుందనే దానిపై స్పష్టత లేకపోవడంతో మార్కెట్లో అనిశ్చితి రాజ్యమేలుతోంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై వెనక్కి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ముడి చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం మళ్ళీ పైకి లేస్తుంది, అటువంటి సమయంలో వడ్డీ రేట్లను తగ్గిస్తే ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమని బ్యాంకులు భావిస్తాయి. వడ్డీ రేట్లు తగ్గవన్న అంచనాలు మార్కెట్లకు ప్రతికూల సంకేతాలను పంపాయి. రుణాలు ఖరీదైతే కంపెనీల విస్తరణ పనులు మందగిస్తాయి, ఇది దీర్ఘకాలంలో వృద్ధిపై ప్రభావం చూపుతుంది. ఈ భయాలే నేడు దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల సునామీకి దారితీశాయి. చమురు అవసరాల కోసం భారత్ దాదాపు 85 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. రూపాయి బలహీనపడటం, చమురు ధరలు పెరగడం వల్ల కరెంట్ ఖాతా లోటు (CAD) పెరిగే ముప్పు పొంచి ఉంది. విదేశీ మారక నిల్వలకు ఇది సవాలుగా మారుతుంది. పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు ఇంధన సరఫరా మార్గాలను మూసివేస్తే భారత ఆర్థిక వృద్ధి వేగం మందగించే ప్రమాదం ఉంది. ప్రభుత్వ ఆదాయాలు చమురు దిగుమతులకే ఖర్చైతే, సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనపై నిధుల కొరత ఏర్పడవచ్చు. ఈ స్థూల ఆర్థిక పరిస్థితులన్నీ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. మరోవైపు ఇరాన్ రాజధాని టెహ్రాన్, లెబనాన్ రాజధాని బీరుట్‌లపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం చేయడం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం కేవలం రెండు దేశాలకే పరిమితం కాకుండా ప్రాంతీయ యుద్ధంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ట్రంప్ వ్యాఖ్యలు చూస్తుంటే అమెరికా ఈ యుద్ధంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దీర్ఘకాలం పాటు జోక్యం చేసుకునేలా కనిపిస్తోంది. యుద్ధం ఆరు వారాలు మించి సాగినా తాము సిద్ధమేనని ఆయన చేసిన ప్రకటన ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ఇది కేవలం భౌగోళిక రాజకీయ సమస్య మాత్రమే కాదు, ప్రపంచ వాణిజ్యానికి పెను గండంగా మారుతోంది.

యుద్ధం కారణంగా సరఫరా గొలుసులో అంతరాయాలు ఏర్పడితే వస్తువుల కొరత ఏర్పడుతుంది. ఇప్పటికే కోవిడ్ తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రపంచానికి ఈ యుద్ధం గొడ్డలిపెట్టుగా మారింది. భారత్ వంటి ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలకు స్థిరత్వం చాలా ముఖ్యం. కానీ అంతర్జాతీయ పరిణామాలు భారత్‌ను రక్షణాత్మక ధోరణిలోకి నెడుతున్నాయి. స్థానిక ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ ద్వారా కొంత వరకు మార్కెట్‌ను ఆదుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, విదేశీ పెట్టుబడిదారుల భారీ ఎగ్జిట్ ముందు అది సరిపోవడం లేదు. స్టాక్ మార్కెట్లు ప్రస్తుతం 'వెయిట్ అండ్ వాచ్' మోడ్‌లోకి వెళ్లిపోయాయి. యుద్ధ మేఘాలు తొలగి, చమురు ధరలు అదుపులోకి వస్తేనే మార్కెట్లు తిరిగి పుంజుకునే అవకాశం ఉంది. లేదంటే మరికొన్ని రోజుల పాటు ఒడిదుడుకులు తప్పవు. ఇన్వెస్టర్లు తొందరపడి అమ్మకాలు చేయకుండా, నాణ్యమైన షేర్లలో దీర్ఘకాలిక పెట్టుబడుల గురించి ఆలోచించడం శ్రేయస్కరం. అంతర్జాతీయ పరిణామాలను నిశితంగా గమనిస్తూ, జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన సమయం ఇది.

# అమెరికా రాడార్ కేంద్రం ధ్వంసం

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇప్పుడప్పుడే ఆరేలా కనిపించడం లేదు. అగ్రరాజ్యం అమెరికాకు గల్ఫ్ గడ్డపై ఊహించని దెబ్బ తగిలింది. ఖతార్‌లోని అత్యంత కీలకమైన అల్ ఉదెయిద్ ఎయిర్‌బేస్‌లో ఉన్న అమెరికా అతిపెద్ద రాడార్ వ్యవస్థను తాము క్షిపణి దాడితో తుత్తునియలు చేశామని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఇన్నాళ్లూ గల్ఫ్ గగనతలాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ, ఇరాన్ కదలికలను ఎప్పటికప్పుడు పసిగడుతున్న ఈ 'మహా రాడార్' కూలిపోవడం అమెరికా సైనిక వ్యూహాలకు గొడ్డలిపెట్టుగా మారింది. ఈ దాడికి సంబంధించిన వార్తలను కేవలం ఇరాన్ మాత్రమే కాకుండా, అమెరికా మిత్రదేశమైన ఖతార్ అధికారులు కూడా ధ్రువీకరించడం గమనార్హం. పశ్చిమాసియాలో జరుగుతున్న సుదీర్ఘ పోరాటంలో ఇప్పటికే వేలాది మంది సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోగా, ఇప్పుడు ఆస్తి నష్టం కూడా ఊహించని స్థాయికి చేరుతోంది. అత్యంత ఖరీదైన సైనిక సామగ్రి, అత్యాధునిక ఆయుధాలు మట్టిపాలవుతున్నాయి. ఈ దాడుల వల్ల మౌలిక సదుపాయాలు నామరూపాల్లేకుండా పోతుండటంతో అటు ఆర్థికంగా, ఇటు సైనికంగా ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఖతార్‌లోని అల్ ఉదెయిద్ ఎయిర్‌బేస్‌లో ఉన్న ఈ రాడార్ పేరు 'ఏఎన్/ఎఫ్‌పీఎస్-132'. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన రాడార్లలో ఒకటిగా పేరుగాంచింది. దీని ట్రాకింగ్ రేంజ్ దాదాపు 5,000 కిలోమీటర్లు అంటే అతిశయోక్తి కాదు. అంటే ఖతార్‌లో కూర్చుని వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువుల కదలికలను ఇది ఇట్టే



పసిగట్టగలదు. అగ్రరాజ్యం తన సైనిక పట్టును నిరూపించుకోవడానికి గల్ఫ్ దేశాల్లో ఏర్పాటు చేసుకున్న స్థావరాల్లో ఇది అత్యంత కీలకమైంది. ఇప్పుడు ఇది ధ్వంసం కావడంతో అమెరికా రక్షణ కవచానికి పెద్ద రంధ్రం పడినట్లయింది.

సాధారణంగా ఆధునిక గగనతల రక్షణ వ్యవస్థలో రాడార్ అనేది గుండెకాయ వంటిది. శత్రు దేశాల యుద్ధ విమానాలు, ఆధునిక డ్రోన్లు లేదా క్షిపణులు తమ సరిహద్దుల్లోకి ప్రవేశించక ముందే వాటిని గుర్తించి, రక్షణ వ్యవస్థలను అప్రమత్తం చేయడంలో రాడార్ పాత్ర కీలకం. ఏఎన్/ఎఫ్‌పీఎస్-132 రాడార్ కేవలం విమానాలనే కాకుండా, ఖండాంతర క్షిపణులను కూడా అత్యంత కచ్చితత్వంతో గుర్తించేలా డిజైన్ చేశారు. దీని విలువే సుమారు 1.1 బిలియన్ డాలర్లు అంటే, మన రూపాయల్లో వేల కోట్లు. 2013లో అమెరికా దీన్ని భారీ వ్యయంతో ఇక్కడ ప్రతిష్టించింది.

ఈ రాడార్ ప్రధాన లక్ష్యం ఇరాన్ క్షిపణి కార్యక్రమాలపై నిరంతర నిఘా ఉంచడం. ఇరాన్ తన క్షిపణి ప్రయోగాలను చేపట్టినప్పుడు లేదా సైనిక విన్యాసాలు చేస్తున్నప్పుడు ఈ రాడార్ ద్వారా అమెరికా డేటాను సేకరించేది. ఇప్పుడు ఈ వ్యవస్థ పనికిరాకుండా పోవడంతో, పశ్చిమాసియాలో అమెరికా సైనిక నిఘా కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇన్నాళ్లూ ఈ రాడార్ అందించే సమాచారం ఆధారంగానే అమెరికా తన తదుపరి వ్యూహాలను సిద్ధం చేసుకునేది, ఇప్పుడు ఆ కన్ను మూసుకుపోవడంతో అగ్రరాజ్యం అయోమయంలో పడింది.

మరోవైపు, ఈ ప్రభావం కేవలం అమెరికాపైనే కాకుండా దాని మిత్రదేశాలైన గల్ఫ్ దేశాలపై కూడా బలంగా పడనుంది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు తమ గగనతల భద్రత కోసం ఈ రాడార్ డేటాపై కొంతవరకు ఆధారపడతాయి. ఇప్పుడు ఈ వ్యవస్థ లేకపోవడంతో ఆయా దేశాల రక్షణ వ్యవస్థలకు కూడా సమాచార లోపం తలెత్తే ప్రమాదం ఉంది. ఇరాన్ చేసిన ఈ వ్యూహాత్మక దాడి వల్ల అమెరికాతో సన్నిహితంగా ఉండే దేశాలన్నీ ఇప్పుడు తమ భద్రతా ఏర్పాట్లను పునఃసమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యుద్ధం అంటే కేవలం సైనికులు తలపడటం మాత్రమే కాదు, సాంకేతికతను దెబ్బతీయడం కూడా అని ఇరాన్ నిరూపించింది. గత కొన్ని ఏళ్లుగా ఇరాన్ తన క్షిపణి సాంకేతికతను గణనీయంగా పెంచుకుంది. అమెరికా వంటి అగ్రరాజ్యం నిర్వహించే అత్యున్నత రాడార్‌ను కచ్చితత్వంతో కూడిన క్షిపణితో కూల్చివేయడం ఇరాన్ మారుతున్న యుద్ధ తంత్రాన్ని సూచిస్తోంది. ఇది కేవలం భౌతిక దాడి మాత్రమే కాదు, అమెరికా ప్రతిష్టను గల్ఫ్ దేశాల్లో దిగజార్చే ఒక బలమైన సందేశంగా ఇరాన్ భావిస్తోంది.

పశ్చిమాసియాలో నెలకొన్న ఈ ఉద్రిక్తతలు ప్రపంచ మార్కెట్లను కూడా భయపెడుతున్నాయి. చమురు సరఫరాకు కీలకమైన ఈ ప్రాంతంలో దాడులు పెరగడం వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉంది. శాంతి చర్చలు విఫలమవుతున్న తరుణంలో, ఇరాన్ ఇలాంటి సాహసోపేతమైన చర్యలకు పాల్పడటం గల్ఫ్ ప్రాంతాన్ని పెనం మీద నుంచి పొయ్యిలో పడేలా చేస్తోంది. అమెరికా ఈ దాడికి ఎలాంటి ప్రతిస్పందన ఇస్తుందనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతోంది.

భవిష్యత్తులో ఈ ప్రాంతంలో సైనిక సమీకరణలు మారే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా తన దెబ్బతిన్న రాడార్ స్థానంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలంటే మళ్లీ వేల కోట్లు ఖర్చు చేయడమే కాకుండా, నెలల తరబడి సమయం పడుతుంది. అప్పటివరకు ఈ ప్రాంతంలో అమెరికా నిఘా బలహీనంగా ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని ఇరాన్ తన కార్యకలాపాలను మరింత వేగవంతం చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఆధునిక యుద్ధ తంత్రంలో టెక్నాలజీ ఎంత బలమో, అంతే బలహీనత కూడా అని ఈ సంఘటన రుజువు చేసింది. బిలియన్ డాలర్ల విలువైన వ్యవస్థలు కూడా ఒక చిన్న క్షిపణి దాడికి కుప్పకూలిపోతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ సంక్షోభం త్వరగా ముగియకపోతే, అది కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచ శాంతికే ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉంది. అగ్రరాజ్యం తన తదుపరి అడుగును ఎలా వేస్తుందో వేచి చూడాలి.

## హోలీ సంబరాల్లో పాల్గొన్న కార్పొరేటర్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మండలాలు మరియు డివిజన్ పరిధిలోని పరిశుద్ధ కార్మికులు పెద్ద ఎత్తున నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి గారి నివాసానికి చేరుకుని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొని హోలీ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోలీ పండుగ ప్రాధాన్యతను వివరించారు. "బాధలను హోలికా మంటల్లో దహించి ఆనందాలను పంచే పండుగ హోలీ. సప్త వర్ణాలు చిరుజల్లులై మనసును తడిపే రంగుల వేడుక హోలీ. ప్రేమానుబంధాలు వసంతంలా వికసించేలా చేసే సంబరం హోలీ. భక్తి పారవశ్యంతో చిందులు వేసే వినోదాల డోలిక హోలీ," అని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని అనుసరించే హిందూ బంధువులకు, ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్టడీ వీసాతో వచ్చి డ్రగ్స్ దందా.. ఇద్దరు విదేశీయులు అరెస్టు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** స్టడీ వీసాపై భారత్‌కు వచ్చి డ్రగ్ పెడ్లర్లుగా మారిన ఇద్దరు విదేశీయులను నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ మరియు రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో అరెస్టు చేశారు. బుధవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో అదనపు డీసీపీ వివరాలు వెల్లడించారు. ఓమన్ దేశానికి చెందిన మహమ్మద్ అబ్దురాబ్ 2009లో విద్యార్థి వీసాపై భారత్‌కు వచ్చాడు. పూణెలోని భరత్ కాలేజీలో బీసీఏ కోర్సులో చేరి మధ్యలోనే వదిలేశాడు. అనంతరం హైదరాబాద్‌కు వచ్చి సిక్కిం మణిపాల్ విశ్వవిద్యాలయంలో చేరినా చదువు పూర్తి చేయకుండా స్వదేశానికి వెళ్లిపోయాడు. 2015లో మళ్లీ స్టడీ వీసాపై హైదరాబాద్‌కు వచ్చి పాస్‌పోర్టు గడువు ముగిసినా ఇక్కడే ఉంటూ డ్రగ్స్ వ్యాపారం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతను ఇప్పటికే ఆరు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పాలస్తీనా దేశానికి చెందిన హసన్ 2016లో విద్యార్థి వీసాపై భారత్‌కు వచ్చి కర్ణాటక కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో బీసీఏ చదివాడు. కోవిడ్ సమయంలో స్వదేశానికి వెళ్లి, 2022లో బిజినెస్ వీసాపై తిరిగి వచ్చాడు. యాలహంక న్యూ టౌన్ పోలీసులు గతంలో డ్రగ్స్ కేసులో అతన్ని అరెస్టు చేశారు. జైలులో ఉన్న సమయంలో అబ్దురాబ్‌తో పరిచయం ఏర్పడింది. బయటకు వచ్చిన తర్వాత వ్యాపారంలో నష్టపోయి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మళ్లీ డ్రగ్స్ దందాకు తెరలేపినట్లు వెల్లడైంది. బెంగళూరులోని ఓ నైజీరియన్ వ్యక్తి నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా, పక్కా సమాచారంతో రాజేంద్రనగర్ పోలీసులు మరియు హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సంయుక్తంగా అరంఘర్ ప్రాంతంలో ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరినీ అరెస్టు చేసి 155 గ్రాముల ఎండిఎంఎ, ఒక కత్తి, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

## ప్రజా నమ్మకాన్ని నిర్వర్తించాలి

- టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్
- మున్సిపల్ చైర్మన్ దుబ్బా సోనియా దర్శన్



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను ఏ నమ్మకంతోనైతే ఓటు వేసి గెలిపించారో, ఆ నమ్మకాన్ని బాధ్యతతో నిర్వర్తించాలని, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ దుబ్బ సోనియా దర్శన్, నర్సింగి పరిధిలోని కోకాపేట్ లోగల టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సన్మానించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడంతో దుబ్బ సోనియా దర్శన్ ను అభినందించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా నమ్మకాన్ని నిర్వర్తిస్తూ.. ప్రతి ఒక్క చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు బాధ్యతతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ప్రజలకు కావలసిన అవసరాలను తీర్చాలన్నారు. విమర్శలకు తావు లేకుండా అభివృధి ధ్యేయంగా పనిచేసుకొని ప్రజల మనల్ని పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కీసరలో హోటళ్ల ఇష్టా రాజ్యం జీఎస్టీ లేని బిల్లులు




- రోడ్ల ఆక్రమణలతో ట్రాఫిక్‌కు అంతరాయం
- వినియోగదారుల్లో పెరుగుతున్న అనుమానాలు
- మున్సిపల్ కార్పొరేషన్ అయిన చర్యలు మాత్రం శూన్యం
- కీసర సర్కిల్ లోనే ఇలా ఉంటే మిగతా ప్రాంతాల్లో ఉన్న హోటల్స్ పరిస్థితి ఏంది



SRI RAGHAVENDRA HOTEL
MAIN ROAD KEESARA
P.NO.9949959839/8143785574
------CASH/BILL------
NO.000179 0 SLM- 0 04-03-26

| DESCRIPTION | QTY | RATE | AMOUNT |
|---|---|---|---|
| GHEE KARAM DOSA | 1.00 | 85.00 | 85.00 |
| RAGI DOSA | 1.00 | 70.00 | 70.00 |
| WADA | 1.00 | 70.00 | 70.00 |
| S.M.BAJJI | 1.00 | 30.00 | 30.00 |
| WATER BOTTLE | 1.00 | 20.00 | 20.00 |
| EXTRA 1/RS | 10.00 | 1.00 | 10.00 |
| CASH | | | ₹ 285.00 |

**కీసర,విశాల భారతి :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, కీసర డివిజన్‌లో ఉన్న పలు హోటళ్లలో జారీ చేస్తున్న బిల్లుల్లో జీఎస్టీ వివరాలు లేకపోవడం వినియోగదారుల్లో అనుమానాలకు దారితీస్తోంది. కీసర మెయిన్ రోడ్‌లో ఉన్న శ్రీ రాఘవేంద్ర హోటల్‌లో ఇచ్చిన క్యాష్ బిల్‌లో హోటల్ పేరు, ఫోన్ నంబర్లు, బిల్ నంబర్, తేదీ మరియు ఆహార పదార్థాల ధరలు మాత్రమే పేర్కొనగా, జీఎస్టీ నంబర్ లేదా పన్ను వివరాలు చూపించలేదు. సాధారణంగా హోటల్ లేదా రెస్టారెంట్ జీఎస్టీ పరిధిలో ఉంటే బిల్‌పై జీఎస్టీ నంబర్, పన్ను శాతం, సీజీఎస్టీ-ఎస్‌జీఎస్టీ వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలని నిబంధనలు సూచిస్తున్నాయి. అయితే కీసర సర్కిల్ పరిధిలోని పలు హోటళ్లలో ఇదే విధంగా సరైన పన్ను వివరాలు లేకుండా బిల్లులు ఇస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. అదేవిధంగా హోటళ్ల ముందు ఉన్న రోడ్లను ఆక్రమించి పాన్ షాపులు, టీ పాయింట్లు, ఫ్రూట్ జ్యూస్ పాయింట్లు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఆక్రమణల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరైన బిల్లులు ఇవ్వకపోవడం ద్వారా అటు ప్రభుత్వానికి రావాల్సిన పన్ను ఆదాయాన్ని దెబ్బతీస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంతతో పాటు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, మున్సిపల్ ఆరోగ్య విభాగం, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

## ఎబీసీ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో రంగుల హోలీ

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

అత్తాపూర్‌లోని లక్ష్మీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిహెచ్ఎంసి పార్క్‌లో ఎబీసీ లాఫింగ్ క్లబ్ అత్తాపూర్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎబీసీ లాఫింగ్ క్లబ్ అత్తాపూర్ యోగా సెంటర్ ఫౌండర్ చైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. సీతారాం మాట్లాడుతూ కులమత వర్గభేదాలు లేకుండా అందరూ ఒకరినొకరు రంగులు పూసుకుంటూ ఆనందంగా జరుపుకునే పండుగ హోలీ అని తెలిపారు. హోలీ పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. వేడుకలకు అతిథిగా హాజరైన తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు, రచయిత, కాలమిస్ట్ నేదునూరి కనకయ్య మాట్లాడుతూ పాత గొడవలు, విభేదాలు మరిచి స్నేహితులు, బంధువులతో కలిసి మెలిసి ఉండేందుకు హోలీ పండుగ మంచి అవకాశమని చెప్పారు. హోలీ కేవలం రంగులు చల్లుకోవడమే కాకుండా ప్రేమ, సంతోషం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. మనసులోని మౌనాలను కరిగించి కొత్త ఆశలకు చిరునవ్వు పంచే పండుగ హోలీ అని అన్నారు. ఎబీసీ లాఫింగ్ క్లబ్ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ శ్రీమతి బి. భానుమతి మాట్లాడుతూ హోలీ పండుగ ధర్మ విజయం సాధించిన దానికి చిహ్నమని పేర్కొన్నారు. ప్రహ్లాదుని భక్తి, హోలికా దహనం చెడుపై మంచి గెలిచిన సంఘటనలని వివరించారు. హోలీ పండుగ మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని, రంగులతో ఆడుకోవడం వల్ల శరీరంలో ఆనంద హార్మోన్లు విడుదలై ఒత్తిడి తగ్గి మానసిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. ఈ వేడుకల్లో క్లబ్ సభ్యులు రామ్మోహన్, బుచ్చయ్య, గోపాల్ రెడ్డి, మురళీధర్ రావు, నరసింహ, ఎస్.ఎస్.ఎన్. మూర్తి, ఉమామహేశ్వరరావు, పంచాక్షరరావు తదితరులు పాల్గొన్నారు. మహిళా సభ్యులు పావని, అనురాధ, పి. సుజాత, కె. సుజాత, నేదునూరి సరిత కుమారి, విజయశ్రీ, ప్రసన్న, శమంతకమణి, రేఖ, ప్రేమలత, విజయ, డాక్టర్ భానుమతి తదితరులు రంగులు చల్లుకుని హర్షోల్లాసంగా హోలీ సంబరాల్లో పాల్గొన్నారు.



## ట్రాఫిక్ సమస్యపై ట్రాఫిక్ సిఐకి వినతి పత్రం

**రాంపల్లి అంబేద్కర్ కూడలిలో ట్రాఫిక్ సమస్య తీర్చండి**



**కీసర,విశాల భారతి :** నాగారం డివిజన్ రాంపల్లిలో ఉదయం అయింది అంటే చాలు నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.అంబేద్కర్ కూడలి సర్కిల్ చిన్నగా ఉండడంతో చర్లపల్లి,ఘాట్ కేసర్, నాగారం మీదుగా వచ్చే వాహనాలతో రోజు రద్దితో పాటు బారి వాహనాలతో రోడ్డు జామ్ అవుతుంది.బుధవారం రాంపల్లికి చెందిన యువజన సంఘాల నాయకుడు రామారం వినోద్ కుమార్ ట్రాఫిక్ సి ఐ శివ శంకర్ నీ కలిసి ట్రాఫిక్ సమస్య తీర్చండి అంటూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.సానుకూలంగా స్పందించిన ట్రాఫిక్ సి ఐ శివ శంకర్ ఉదయం సమయంలో ఒక్క కానిస్టేబుల్ ను ఏర్పాటు చేస్తాం అని చెప్పడం జరిగింది.అలాగే అంబేద్కర్ కూడలిలో ట్రాఫిక్ సమస్యపై మా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగా చూస్తాం అని తెలిపారు.ఈ సందర్భంగా రామారాం వినోద్ కుమార్ మాట్లాడుతూ ఉదయం స్కూల్ పిల్లలు వెళ్ళే సమయంలో ఓ పక్క ట్రాఫిక్ మరో పక్క రోడ్డు గుంతలు ఉండడంతో ప్రయాణికులు సైతం చాలా ఇబ్బంది పడుతున్నారు అని తెలిపారు.ట్రాఫిక్ సమస్యపై ట్రాఫిక్ సి ఐ శివ శంకర్ నీ కాలవగా సానుకూలంగా స్పందించారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్తీక్,సంతోష్,బబ్లూ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనూష మృతిపై విచారణ జరపాలి



**కూకట్ పల్లి, విశాలభారతి:** గిరిజన బాలిక అనూష మృతి పై విచారణ జరపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భూ యజమాని అంతమొల్ల దయాకర్ రెడ్డి బలవంతంగా 14 సంవత్సరాలు నిండని అనూషతో పనిచేయించుకోవడం వల్లనే ఆమె మృతి చెందిందని అన్నారు. స్వయానా రాజకీయ నాయకుడైన ఆయన బాధితుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారికి అతి తక్కువ వేతనం చెల్లిస్తూ పని చేయించుకున్నారని తెలిపారు. పనికి వెళుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి గిరిజన బాలిక అనూష మృతి చెందడానికి దయాకర్ రెడ్డి పూర్తి బాధ్యుడని పేర్కొన్నారు. పోలీసులు మాత్రం దీనిని సాధారణ యాక్సిడెంట్ కేసుగా నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఆమెను బాల కార్మికురాలిగా నిర్ధారించడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. రాజకీయ అండదండలు ఉండడంతోనే దయాకర్ రెడ్డి పై బాలల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయడానికి పోలీసులు వెనుకాడుతున్నారని అన్నారు. అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి ఆమెను బాల కార్మికురాలిగా గుర్తిస్తూ బాధ్యుడైన దయాకర్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలోనే నవాబ్ పేట్ మండల కేంద్రంలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పోరాటానికి కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీత, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బి.శివరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుట్టకింది రవికుమార్, విహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీకాంత్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉమ, జామ దశరథ్, శ్రీనివాస్, బి.నరేందర్, ఎ.మల్లేష్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాపునగర్‌లో ఘనంగా హోలీ పండుగ వేడుకలు



**రాజేంద్రనగర్, విశాలభారతి:** లంగర్ హౌజ్ పరిధిలోని బాపునగర్ ప్రాంతంలో హోలీ పండుగను స్థానికులు ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ రంగుల హోలీ ఆడి ఆనందోత్సాహాలతో మునిగిపోయారు. ఉదయం నుంచే యువత రంగులు, పిచికారీలతో ఒకరిపై ఒకరు రంగులు చల్లి సందడి చేశారు. మహిళలు సంప్రదాయ వంటకాలు సిద్ధం చేసి పొరుగువారితో పంచుకున్నారు. చిన్నారులు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ హోలీ సందడిని రెట్టింపు చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు హోలీ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని మతాలు, వర్గాల ప్రజలు కలిసి పాల్గొనడం ఈ ప్రాంత ప్రత్యేకతగా నిలిచింది. పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం మీద బాపునగర్‌లో హోలీ పండుగ ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా నిర్వహించబడింది.

## భారత జాతీయ మహిళా సమైక్య ఆవిర్భావ వేడుకలు

**సోదరీమణులకు భారత జాతీయ మహిళా సమైక్య ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు**



**బోడుప్పల్, విశాలభారతి:** బోడుప్పల్ సర్కిల్ 10వ, డివిజన్ మేడిపల్లి, భగత్ సింగ్ నగర్ కాలనీలో భారత జాతీయ మహిళా సమైక్య 115వ, ఆవిర్భావ దినోత్సవ వేడుకలుకు మేడిపల్లి మండల కార్యదర్శి సిహెచ్ మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి మరియు మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ హాజరు కావడం జరిగినది. భారత జాతీయ మహిళా సమైక్య జండా ఆవిష్కరణ జిల్లా అధ్యక్షురాలు ఎగరవేసి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల హక్కులను కాలరాస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు హైమావతి తీవ్రంగా ధ్వజమెత్తారు. మహిళలకు నాణ్యమైన విద్యను, వైద్యాన్ని కేంద్రం దూరం చేస్తోందని ఆమె విమర్శించారు. రానున్న కేంద్ర బడ్జెట్లో వైద్యం, విద్యా రంగాలకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళలకు అండగా నిలిచే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేసిందని, బడ్జెట్లో నిధులను భారీగా తగ్గించిందని ఆరోపించారు. కేవలం నగరాల పేర్లను మార్చినంత మాత్రాన మోడీ 'విశ్వగురువు' కాలేరని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, రక్షణతో కూడిన నాణ్యమైన జీవనాన్ని అందించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు గిరిజ, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కే ప్రమీల బి కే ఎం యు మండల కార్యదర్శి కే మహాలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దండు రమేష్, మహిళా సమైక్య నాయకురాల్లో పి ఆండాలు, సరిత, రాజమ్మ మేకల లక్ష్మి, నరసమ్మ, రమాతార, భారతి, సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు భగత్ సింగ్ నగర్ కాలనీవాసులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వడ్డేపల్లి నివాసంలో ఘనంగా హోలీ వేడుకలు



**కూకట్ పల్లి విశాలభారతి:** రంగుల సందడి సాక్షిగా వడ్డేపల్లి ఇంట హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో జరిగిన ఈ ఉత్సవం రాజకీయ రంగు దాటి సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పరిశుద్ధ కార్మికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమం నిజమైన హోలీ స్ఫూర్తిని ప్రతిబింబించింది. రంగుల హరివిల్లు మధ్య నవ్వులు చిందించిన ఈ వేడుకలో పరస్పర శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిల పంచి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ హోలీ పండుగ చెడుపై మంచిని సాధించిన విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. సమాజంలో సోదరభావం, ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత బలపడాలంటే ఇలాంటి పండుగలు అందరినీ కలిపే వేదికలుగా మారాలని అభిప్రాయపడ్డారు. రంగుల్లా వైవిధ్యాలు ఉన్నా మనమంతా ఒక్కటే అన్న భావనతో సమాజ అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## తెలివైన నిర్ణయాలతో దూసుకెళ్తున్న శ్రీలీల..

# బాలీవుడ్‌లో భారీ ప్లాన్స్!

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌ను ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. గ్లామర్, డ్యాన్స్, ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ యంగ్ బ్యూటీ, కేవలం ఐటమ్ సాంగ్స్‌కే పరిమితం అయితే కెరీర్‌పై ప్రభావం ఉంటుందని ముందుగానే అంచనా వేసి జాగ్రత్త పడినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.కొన్ని ప్రాజెక్టుల్లో హీరోయిన్ అవకాశంతో పాటు ఐటమ్ సాంగ్ చేయాలని కండీషన్స్ పెట్టినప్పుడు, ఆ ఆఫర్లను సైతం వదులుకోవడంలో ఆమె వెనుకాడలేదని సమాచారం. స్క్రిప్ట్, పాత్ర ప్రాముఖ్యత, భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటోందని, ప్రతి ప్రాజెక్ట్ ముందు కుటుంబ సలహాలు కూడా తీసుకుంటోందని టాక్. ప్రస్తుతం శ్రీలీల తెలుగు సినిమాల కంటే హిందీ, తమిళ చిత్రాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. ఇప్పటికే బాలీవుడ్‌లో సంచలన మ్యూజికల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఆషికి 3 లో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో బాలీవుడ్ స్టార్ కార్తీక్ ఆర్యన్‌కు జోడీగా కనిపించనుంది. ఈ చిత్రానికి అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. సినిమాలో భావోద్వేగాలు, ఇంటిమేట్ సన్నివేశాలు ఉన్నప్పటికీ, పాత్రకు అవసరమైతే పూర్తి స్థాయిలో న్యాయం చేయడానికి సిద్ధమని శ్రీలీల సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఈ సినిమా హిట్ అయితే, ఆమె బాలీవుడ్ కెరీర్‌కు గేమ్ చేంజర్ అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో శ్రద్ధా కపూర్కూడా 'ఆషికీ 2'తో భారీ గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. ఇక ఇదే కాంబినేషన్‌లో మరో యాక్షన్ థ్రిల్లర్ కూడా ప్లాన్ చేస్తున్నారనే వార్తలు బాలీవుడ్ మీడియాలో వినిపిస్తున్నాయి. 'ఫీటమ్ పురా' అనే టైటిల్ పరిశీలనలో ఉందని ప్రచారం. అధికారిక ప్రకటన రానప్పటికీ, ఒక సినిమా సెట్స్‌పై ఉండగానే మరో సినిమా ఆఫర్ రావడం ఆమె క్రేజ్‌ను చూపిస్తోంది. అంతేకాకుండా, కోలీవుడ్ స్టార్ ధనుష్ 55వ చిత్రంలోనూ శ్రీలీల హీరోయిన్‌గా ఎంపికైనట్లు సమాచారం. కెరీర్ ప్రారంభ దశలోనే ధనుష్ సరసన నటించే అవకాశం రావడం ఆమెకు పెద్ద ప్లస్‌గా భావిస్తున్నారు. ఇక టాలీవుడ్‌లో ఆమె నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ త్వరలో విడుదల కానుంది. ఇందులో పవన్ కళ్యాణ్‌కు జోడీగా కనిపించనుంది. ఈ చిత్రం విజయం సాధిస్తే శ్రీలీల పేరు మళ్లీ టాలీవుడ్‌లో మారుమ్రోగడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలివైన నిర్ణయాలతో కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటున్న శ్రీలీల, దక్షిణాది నుంచి బాలీవుడ్ వరకూ తన మార్క్ చూపించడానికి సిద్ధమవుతోంది. రానున్న రోజులు ఆమె కెరీర్‌కు కీలకంగా మారనున్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.